# పొగ త్రాగరాదు

మరొక మాటు "సిగరెట్టు కాల్చుకుంటాను అగ్గిపెట్టి పట్రమ్మని" అడిగారు. సిగరెట్టిలా గివ్వండి అంటించి పట్టుకొస్తాను. మీరు సిగరెట్టు తీసి ఇచ్చారు నవ్వుతూ. నేను నీళ్ళ పొయ్యదగ్గరకెళ్ళి కొబ్బరిడొక్కుతో సిగరెట్టు ముట్టించాను. అప్పుడు నాకు ఒక మాటు శ్రోగ్గామీరు ఎలా పట్టుకుంటారో అలా వేళ్ళ సందున సిగరెట్టు పట్టుకుని పొగ పీల్చాలనే చిలిపి ఊహ కలిగింది. నేను సిగరెట్టు నోట్లో పెట్టుకుని ఒక్కసారి ఎలావుంటుందోనని పొగ పీల్చాను. అంతే. నోటినిండా, ముక్కునిండా పొగ

వెళ్ళిపోయి కళ్లు గిర్రున తిరిగాయి. తూలుతూ తూలుతూ ఆ ఎంగిలి సిగరెట్టు పట్టుకుని గదిలోకొచ్చి మీముందు నిలబడ్డాను. "హా" అంటూ నోరు తెరవమని అడుగుతారనుకున్నాను. అడక్కుండానే నా చేతిలోని సిగరెట్టుని మహద్భాగ్యంగా తీసుకుని అమృతంసేవించినట్టు సేవించారు. నేను సిగరెట్టు కాల్చానని చెప్పకుండానే మీకు తెలిసిపోయివుంటుంది. అప్పుడునాకు పదహేనో పదహారో .... మీఅమ్మతో చెప్పనా .... మీనాన్నతో చెప్పనా ....అంటూ బెదరించేవారు నన్ను: "పొగత్రాగిన ప్రేయసి" అంటూ కథ రాస్తానని పుడికించేవారు నన్ను. కాని ఆవేళ నేను మీ కిచ్చిన ఎంగిలి సిగరెట్టు - అటువంటి సిగరెట్టుకాల్చి జన్మతరించి పోయినట్లు మీరు లోలోన మురిసిపోయి వుంటారు.మానాన్నతో ఎక్కడ చెబుతారోనని నేను మిమ్మల్ని కళ్లతో ఎంతగా వేడుకునేదాన్నో ఓమారు గుర్తు చేసుకోండి!

అ లిపిలేని కళ్ల భాషముందు రేడియో టెలిగ్రాము, టెలివిజన్లు ఎందుకు పనికొస్తాయి? కొత్త పెళ్ళికూతురు తనమనసులోని భావాలను, ఆశలను కళ్ళ భాషతో చెప్పుకునేటప్పుడు ఏ పెళ్ళికొడుకేనా అర్థం చేసుకోలేకపోతే ఆ ఇడియట్ కి ఇచ్చిన కట్నం తిరిగి పుచ్చేసుకుని నాలుగు తన్ని మెడబట్టుకు వీధిలోకి గెంటెయ్యాలి! సగానికి సగంమంది పెళ్ళికొడుకులు ఆడపిల్ల కళ్ళలోని ఆశల రెపరెపలను అర్థం చేసుకోలేరు. వాళ్ళ బుష్షర్టులు, వాళ్ళ చాకింటి ఇస్త్రీ మడతలు, సూదిబూట్లు వెకిలి నవ్వులు చూసి ఆడపిల్లలు వలచి వస్తారనుకుండే అలాటివాళ్ళను "కూల్యలోనించోబెట్టి" "గుంజీలు"తీయించాలి! ఆడబడుచు లాంఛనాలు, పట్టుబట్టలు, వెండి కుంకంభరిణి, గంధపుగిన్నెలూ, కంచం, చెంబూ ఇవి కోరి పీటి చుట్టూ దాంపత్య జీవితంలోని శోభ, అల్లుకుని వుందని ఎవరేనా భ్రమపడితే మా సుబ్బమ్మత్త భాషలో "ఆ తొత్తుకొడుకు"ని బాదంచెట్టుకు కట్టి కండచీమలచేత కరిపించి కారప్పిండి జల్లుకు తినాలి.

నేను తెలిసో తెలియకో సిగరెట్టు కాల్చాను. మీరూ ఒకటి రెండు సారులు నాచేత సిగరెట్టు కాల్పించారు. అందులో ఏమీ సుఖంలేదని నాకు ఎవరూ చెప్పకుండా తెలిసిపోయింది. కాని మీరు నన్నెప్పుడూ దానిసలా చూడలేదు, నేను మిమ్మల్నెప్పుడూ సంపాదించిపెట్టే. సంసార రథాన్ని లాగే "రిక్షావాలా"లా చూడలేదు.

మనలో ఒక చిత్రమైన స్నేహభావం ఆప్యాయత నెలకొన్నాయి. మనం "బెస్టు ఫ్రెండ్స్"గా జీవితం ప్రారంభించాము. చిరకాలం "బెస్టు ఫ్రండ్స్" గానే వుండిపోవాలి! దీర్ఘసుమంగళీ భవ అని అంటే అందులో ఇంతకన్న గొప్ప నిగూఢార్థం వుండేదిసిందా?

ఏదో నేనూ సిగరెట్టు కాల్చాను. కాల్చినంత మాత్రాన కొంప మునిగిపోలేదని చెప్పానుకాని ఆడ పిల్లలను. పెళ్ళికూతుళ్ళను పొగత్రాగమని ప్రోత్సాహించాలని నా ఉద్దేశం కాదు పొగత్రాగరాదు! ఆ మాట నిజమే....

మొట్ట మొదట నేను ఆడ సిగరెట్టు-అంటే మన పవిత్ర భారత దేశంలో ఒక స్త్రీ "అనగా చదువుతున్న ఆడది సిగరెట్టు కాల్చడం చూసి ఆశ్చర్యపోయింది. అత్తిలిలో. ఇరవై ఏళ్ళక్రితం"

అప్పలమ్మలు చుట్ట కాలుస్తారు. అది ఎంతో సహజంగా మన సంస్కృతికి నప్పినటు కనిపిస్తుంది. చుట్ట నోట్లో పెట్టుకొని ఇక్కడ్నుంచే అప్పలమ్మ ఏ సింహాద్రి అప్పన్నకో. తిరుపతి వెంకటేశ్వర స్వామికో చేతులెత్తి నమస్కారం పెట్టకలదు. అందులో ఎంత మాత్రం ఎబ్బెట్టులేదు. కాని ఒక ఇల్లాలు. కాలేజీ అమ్మాయి. గంటకో నవల రాసే రచయిత్రి. వీళ్ళలో ఏ పడుచుపిల్లనేనా చేతిలో సిగరెట్టుతో ఊహిస్తే ఏం కొంప మునిగిపోయింది? జీవితంలో మంచి టెన్షన్ వచ్చి

నపుడు ఒక సిగరెట్టు పీలిస్తే కాస్త హాయిగా వుంటుంది. ఈ పాటి సుఖము నేనింత వరకెరగనే అనిపిస్తుంది. సిగరెట్టు కాల్చకుండా రచయిత్రులు కథలు. నవలలు రాస్తున్నారుగాని అవి అంత బాగుండటంలేదు. సిగరెట్టు కాల్చని హీరోని ఆడపిల్లలు లైక్ చెయ్యరు. ఒక నవలగాని. ఒక కథగాని చదివితే అది సిగరెట్టు తాగేవాడు రాసిందో, తాగనివాళ్ళు రాసింవో ముట్టుకుంటే తెలిసిపోతుంది. ఆ సీక్రెట్ నేను చెప్పను గాక చెప్పను.

ఇంతకీ అత్తిలిలో మొదటిసారి నేను పొగత్రాగే పుణ్య స్త్రీని చూశానని చెప్పాను కాని ఆవిడ హిస్టరీ చెప్పలేదు.

ఆవిడ మిడ్ వైఫ్ — అనగా మంత్రసాని మంత్రసానంటే మంత్రాలొస్తాయేమో, అందు కలా అంటున్నారనుకున్నాను. ఆవిడ దక్కను సిగరెట్లు కాల్చేది. ఆవిడ కొడుకు నాకు మూడోక్లాసునుంచీ క్లాసుమేటు. అత్తిలిలో చెరువు గట్టున సాయిబుల ఇళ్ళమధ్య ఆ మంత్రసాని కొంప వుండేది.

ఆవిడ పొడవుగా నల్లగా విరిగిపోయిన. చేతుల్లేని కుర్చీలో కూర్చుని దక్కను సిగరెట్లు కాలుస్తూండేది. టూరింగు టాకీస్‌లో ఆవిడకు సినిమాలు ఫ్రీ: ఆవిడతో నేను ఫ్రీగా టూరింగు సినిమాలు చూస్తూ వుండే దానిని. ఆ సినిమాహాల్లో కూడా ఆవిడ "ఫ్రీ"గా దక్కను సిగరెట్లు కాలుస్తూ నవ్వుతూ మొగుడి దగ్గర మాత్రం గంభీరంగా మొహం పెట్టేది. వాళ్ళు ముగులూ అవీ పెట్టుకునేవాళ్ళు కారు. ఆ ఇళ్ళూ గోడలూ చవుడురాలిపోతూ బొగులు బొగులు మంటూ వుండేవి. వాళ్ళు క్రైస్తవులో, సాయిబులో నాకు జ్ఞాపకంలేదు కాని మంత్రసానిగారి దొడ్లో సీమచింత చెట్టు వుండేది. ఆ సీమచింత చెట్టు క్రింద ఏ చీకూ చింత

లేకుండా దక్కను సిగరెట్టు పెట్టెలతో, బుట్టలు, చక్రాలు, ముచ్చె కాగితంలో గంధపు గిన్నెలూ గ్లాసులూ చేసుకుని దాచుకుని వాటికోసం పోట్లాడుకునే వాళ్ళం, ఇప్పుడు ఆస్తులకోసం, వెండి బంగారాల కోసం అన్నదమ్ములు, తండ్రులూ కొడుకులూ ఎలా పోట్లాడుకుంటారో, కోర్టుచుట్టూ తిరుగుతారో అంతకన్నా ఎక్కువగా తగూలాడుకునే వాళ్ళం।

ఆ మంత్రసాని భర్తకూడా దక్కను సిగరెట్టు కాలుస్తూ చేటలో బియ్యం పోసుకుని బియ్యంలోంచి గెడ్డల్ను ఏరిపారేస్తూ తువ్వాలతో చెమట తుడుచుకుంటూ పెళ్ళాన్ని తల్చుకుని గర్వపడుతుండే వాడో లేక జీవితాన్ని తల్చుకుని తిట్టుకుంటూ వుండే వాడో నా కైతే జ్ఞాపకం లేదు కాని - ముచ్చె కాగితపు గంధం గిన్నెలూ, సిగరెట్టు డొక్కులతో కట్టిన బుట్టలూ మాకు ఎంత ఆనందాన్ని కలుగ చేసేవో అందులో నూరో వంతు ఇప్పుడీ ఖరీదైన రూపాయి నయా పైసల జీవితంలో కన బడవే!?

"పొగ త్రాగరాదు నిజమే!"

ఇప్పుడు నాకు లక్షరూపాయలిస్తే అప్పుడు మీరు నా చేత సిగరెట్టు కాలిపించి నోరు వాసనేస్తుందని వక్కపొడి నోట్లో వేసి ముసి ముసి నవ్వులు నవ్వుతూ కళ్ళతో నేను వేడు కుంటుంటే మాటల్తో నన్ను వుడికించిన అజ్ఞానపు టంధకార యుగంలో ఆచిలిపి చిలిపి కయ్యాలూ చిన్న చిన్న సరదాలతో వెళ్ళిన రోజులు మళ్ళీ వస్తాయా? మళ్ళీ మళ్ళీ రావు కదా—

ఇప్పుడు నేనూ ఆ ముక్కే అంటాను 'పొగ త్రాగరాదని'

నిజమే—పొగరు మోతు పడుచు పిల్లలు పొగ త్రాగరాదు

సిగరెట్టు - తాగేవాళ్ళు రాసే నవలలూ కథలూ ఎందుకు బావుంటాయో మరోమాటు చెబుతాను.

ఇప్పుడు డల్ గా వుంది.